స్వార్థం - త్యాగం

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

ఇంతకు ముందు వరకూ వాన కురిసి, యిప్పుడే వెలిసింది. అయినా నీలాకాశం యింకా నిర్మలం కాలేదు. మూడు గంటలను చదువుతూన్న పుస్తకం మూసి వచ్చి లేడీ డాక్టరు విశాలాక్షి పిట్టగోడ వద్ద నిల్చొని మేఘ క్రిందకు చూస్తోంది.

పట్టపగలే సాయంత్రంలా వుంది. ఈ విషయమే స్ఫురించి విశాల చిరాకు పడింది. వర్షం వస్తే అన్నీ నిర్బంధాలే. శుభ్రమైన బట్టలు ధరించటానికి వీలు లేదు. షికారు పోదామంటే వీలు లేదు. ఇవాళ ఆది వారమే కాబట్టి యీ పూటంతా ఖాళీ. కాస్త ఊపిరి తీరిగ్గా పీల్చుకునేది వారానికి యీ సగం రోజే. మళ్లీ తెల్లవారితే మామూలే. తిరిగి వానరాకుండా వుంటేనే యీ సాయంత్రం ఏమయినా సర్దాగా తిరగటం.

సందేహం నివృత్తి చేసుకునేందుకు ఆమె తల ఎత్తి ఆకాశంలోకి చూసింది. ఆశ నిరాశ అయింది. అనుమానమే—విసుక్కుంది.

ఏదో తోచి వెనుదిరుగ బోయేసరికి అప్పుడే మలుపు తిరిగి తమ యింటిని సమీపిస్తున్న ఓ చిన్న కారు దృగ్గోచరమైంది. "కొంప తీసి..."—భయ పడింది. ఈ కారు తమ గేటు ముందరే ఆగదు కదా.

కారు గేటు ముందరే ఆగింది.

విశాల వచ్చే విసుగుతో తొంగి చూసింది. కారు లోంచి ముందు తలుపు తెరుచుకుని ఓ యువకుడు దిగి పైకి చూశాడు. పైనున్న షేడ్ మీద నుంచి అయి దారు నీటి బిందువులు జారి ఆమె తలమీద పడి, వెనక్కి జారగిలబడేటంతలో అతను విష్ చేశాడు.

ఆమె తప్పని సరిగా, మనసులో దూషిస్తూ మెల్లగా నడిచి క్రిందకు వొచ్చింది. అప్పటికే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి సోఫాలో కూర్చున్న ఆ యువకుడు వినయంగా లేచి నిలబడ్డాడు. కూర్చో మన్నాక కూర్చున్నాడు.

"ఏం కావాలి?"

"చాలా అర్జంటు"

"ఏం కావాలి?" విసురుగా, విసుగ్గా అడిగింది ఆమె.

అతనీసారి కొంచెం కంగారు పడ్డాడు; అన్నాడు "నా మిసెస్‌కి పెయిన్స్ వస్తున్నాయి. దయవుంచి రావాలి"

"ఎక్కడికి?"

"మా వూరికి"

"వూరికా? ఈ వూరు కాదా" ఆశ్చర్యపడింది విశాల.

కొంచెం జంకుతూ ఆ యువకుడు "ఊహు; కాని యిక్కడకు ఆరు మైళ్ళే" అన్నాడు.

విశాల అతన్ని నిశితంగా పరీక్షించింది. బయటకు ఎక్కువ తెలియపర్చకపోయినా ఆంతరంగికంగా చాలా వ్యాకులతనుభవిస్తున్నట్లుగా వున్నాడు. వాలకం చూస్తే వొదిలేటట్లు లేడు. తనమీద గురివుంచి వచ్చిన వ్యక్తిని, మిష పెట్టి పంపటం కష్టమే. అన్యాయం కూడా.

"దప్పున రారా!"

విశాల నిస్సహాయురాలైంది. "సారీ...యింకెవరి దగ్గరకైనా" అని కనీసం తప్పించుకునేందుకు ఒక ప్రయత్నమైనా చేద్దామనుకున్న ఆమె నోరు మూత పడింది.

"ఇదే మొదటిసారి. ఏమవుతుందోనని భయంగా వుంది"

ప్రశ్నలు అడిగి అతన్ని వేధించటానికి ఎక్కువగా అవకాశం లేదు. ఎన్ని ప్రశ్నలు అడిగినా ఏవో సాకులు చెప్పి "మీరే రావాలి" అని పట్టుబట్టే సమర్థత లేనివాడై వున్నాడా యువకుడు?

చేసేది లేక అనంగీకారంగానే లేచి నిలబడి "ఉండండి" అని లోపలకు వెళ్ళింది. పది నిమిషాల్లో తల్లికి చెప్పి కావలసిన యిన్‌స్ట్రుమెంట్సు వున్న బ్యాగ్‌తో గదిలోకి వచ్చింది. అతను లేచి నిల్చుని బ్యాగ్ అందుకుని, బయటకు నడిచాడు. ఆమె మౌనంగా అతన్ని అనుసరించి, కారు వెనక సీట్లో కూర్చుంది. అతను ముందు సీట్లో డ్రైవరు ప్రక్క కూర్చున్నాడు.

కారు కదిలాక విశాల నిట్టూర్చింది. ఇవాళ ఎంత ప్రోగ్రాం! ఎన్ని ప్లాన్లు?

ఓ క్షణం ఆగి "టాక్సీనా?" అని అడిగింది. ఎక్కే ముందు చూసుకోలేదు.

"అవునండి"

ఆమె మౌనం వహించింది. ఓ అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాక, ఓ విషయం స్ఫురించి అంది. "మా మిడ్ వైఫ్ లీవ్ మీద వుంది. మీ ఊళ్లో.."

"ఉన్నారు లెండి. ఆ జాగ్రత్త తీసుకునే వచ్చాను" అని వెంటనే ఆ యువకుడు అన్నాడు.

* * * *

నాలుగు గంటలకాలం గడిచింది. లేడీ డాక్టర్ విశాల యివాళ అదృష్టవంతురాలు. ఎక్కువ శ్రమ లేకుండా సఫలీకృతురాలైంది. మొగపిల్లవాడిని దంపతులకు అందచ్చింది.

అతను ఫీజు తెచ్చి యిచ్చాక తీసుకుని "యిహ వెడతాను" అంటూ లేచిందామె.

"వొచ్చి దిగబెడతాను" అన్నాడు.

జాలిపడి, నవ్వి అంది విశాల "వొద్దు. వెళ్లగలను. ఈ సమయంలో మీరు యింట్లో వుంటేనే బాగుంటుంది."

కారు చిన్నగా కదిలాక లైటు వెలుగులో టైము చూసుకుంది. ఏడు పది నిమిషాలు. గతుకులరోడ్డు. అరగంట ప్రయాణం.

కొంతదూరం పోయాక గాని పొరపాటు చేశానని తెలియలేదామెకు. తను చేసింది అంత ఆరోగ్యకరమైన పని కాదని అప్పుడు గ్రహించింది. మధ్యాహ్నం అవటం మూలాన ముసురుగా వున్నా వచ్చేటప్పుడు దారి ప్రమాదకరమైనదని అనిపించలేదు. ఇప్పుడు యీ రహదారి నిజస్వరూపం బయటపడింది. కటిక చీకటి. అటూ యిటూ జీబూతాల్లా చెట్లు. భయంకరమైన నిశ్శబ్దం.

అరగంట యీ నిశ్శబ్ద నిశీథిలో పయనం. భయపడవలసిన విషయం ఎందుకు కాదు? విశాల డాక్టరే—కానీ లేడీ డాక్టరు.

ఆమె బిగబట్టుకుని కూర్చుంది. ఈ డ్రైవర్‌ను యిష్టం వచ్చినట్లు అధికారరీత్యా ఉపయోగించుకునే సాహసం యీ స్థితిలో ఆమెలో హరించింది. "కొంచం స్పీడుగా పోనియ్యి డ్రైవర్" అనటానికి కూడా ఆమె సంసిద్ధురాలు కాలేకపోయింది. ప్రయత్నించి విరమించింది.

బహుశా యింకా మూడు మైళ్లు కూడా పోయి వుండదు. గమ్యస్థానం సగం దూరం పైగా వుంది. హఠాత్తుగా కారే ఆగింది.

విశాల భయకంపితురాలైంది.

"ఏ...మి...టి...ఏ...."

ఆమె అడగలేదు. డ్రైవరు మాట్లాడకుండా సెల్ఫ్ లాగి రెండుమూడు సార్లు ప్రయత్నించాడు, ఉహుఁ స్టార్టు కాలేదు. టార్చిలైట్ తీసి తలుపు తీసుకుని బయటకు వెళ్లి, బాయ్‌నెట్ ఎత్తిచూస్తున్నాడు.

లేడీ డాక్టర్ గారికి ఏమి చేయాలో పాలుపోలేదు. మనుషులకిచ్చినట్లు ఆమె నోరులేని యీ కార్లకు యిన్‌జక్షన్ యివ్వలేదు కదా. ఓ నిమిషం తటస్థంగా ఊరుకుని, ఏదో తోచి, ధైర్యం తెచ్చుకుని, బయటకు దిగింది. టార్చిలైటు వెలుగుల్లో డ్రైవరు ఏదో యాతన పడుతున్నాడు. మెల్లిగా అతన్ని సమీపించి కంపిత స్వరంతో అడిగింది,

"ఏమయింది?"

"కార్బ్యురేటర్‌లో ఏదో లోపం వచ్చింది సాబ్. దీని అంతు తేలుస్తాను" తల ఎత్తకుండానే జవాబు వొచ్చింది.

"ఎంతసేపు పడుతుంది?"

"పది నిమిషాలు"

విశాల మౌనం వహించింది. తిరిగి లోపలకు పోయి కూర్చో బుద్ధి కాలేదు. చుట్టూరా చీకటి. చడీ చప్పుడూ లేదు. ట్రాఫిక్ అసలే లేదు. భీతి చెందవలసిన అవసరం ఎందుకు లేదు? కదిలి ఓ అడుగు

వేసి, కొంచంగా జారింది. చాలాసేపు వర్షం కురియటంవల్ల రోడ్డంతా బురదమయంగా వుంది. చీరె అంచులు పాడుగాకుండా జాగ్రత్తగా నడిచి, ఓ చెట్టు క్రిందకువచ్చి నిల్చుంది. గాలికూడా లేదు, ప్రకృతి సరేసరి చీకటి తెరల మాటున దాగింది కదా. ఏం చెయ్యాలి యిప్పుడు?

చూడగా, ఆమెలో ఎప్పుడో జనించిన చిరాకు అధికం కాసాగింది. అది నైరాశ్యంగాకూడా మారుతోంది. ఈ సాయంత్రం అంతా ఎప్పటిలాగా గడిచింది. కొత్తదనం ఏదీ లేదు సరదా అసలే లేదు. కానీ యిలా కారు మధ్యదారిలో ఆగినప్పుడైనా ప్రక్కన యిద్దరు ముగ్గురు స్నేహితులు వుంటే...

హఠాత్తుగా ఉలుక్కి పడింది. మానవ సంచారం ఏమీ లేని యీ అంధకారంలో వొంటరిగా, ఓ ముక్కూ మొహమూ తెలియని వ్యక్తితో యీ ఏకాంత ప్రదేశంలో వున్నాననే తలంపు వచ్చేసరికి వళ్లంతా జలదరించింది. రక్తం ఘనీభవించి నట్లయింది.

కొన్ని గజాల దూరంలో, తంటాలు పడుతున్న డ్రైవరు వంక చూసింది. పొరపాటునైనా యిటువైపు చూడటం లేదు. అయినా విశాల ప్రసన్నురాలు కాలేదు. ఏదయినా అపాయం సంభవిస్తే యిక్కడ తనను కాపాడేది ఎవరు?

ఆమె హృదయ క్షేత్రంలో డ్రైవరు నిలిచి, క్రూరంగా నవ్వుతున్నాడు. ఆ నవ్వులోని అంతరార్థం స్త్రీయైన విశాలకు తెలుసు.

ఆమె భావాలు అంతటితో ఆగలేదు.

హఠాత్తుగా దొంగలు వచ్చారు. వాళ్ళకు పెద్ద పెద్ద మీసాలున్నాయి. తనని బయటకు రమ్మన్నారు. తన కంఠసీమలో ఒకేఒక నెక్లేస్. అది కాస్తా కాజేశారు అంతటితో ఆగినా బాగుండును. వాళ్ళు యింకా ఏమిటి ఆశిస్తున్నారు? వొణికి పోతూందితను.

నవ్వొచ్చింది విశాలకు. అందరి వంటి స్త్రీ కాదు తను. చదువుకుంది. తెలివిగలది. కావాలని ఓ యువకుడి సహాయం తిరస్కరించింది. మళ్లీ ఎందుకంత భయం, కాని అంత చీకటిలో కూడా. తనని ఎవరూ చూడకపోయినా దొంగనవ్వు ఎందుకు నవ్వుతుందో ఆక్షణంనుంచీ అర్థం కావటల్లేదామెకు.

ఈ విచిత్రమైన అవస్థభరించటం ఆమెకు దుర్భరంగా వుంది. ఇంకా ఎంతసేపని అడుగుదామనుకుంది. తలఎత్తి చూసింది. ఓ క్షణంపాటు ఆనందంతో పరవశురాలైనిల్చుంది. దూరంగా ఆమెకు ఆశాజ్యోతి —ఊహు— ఆశాజ్యోతులు కనిపించాయి.

అవి క్రమక్రమంగా సమీపిస్తున్నాయి.

బాగా ధైర్యం చిక్కింది. మెల్లగా నడిచి రోడ్డుమీదకు వచ్చి నిల్చుంది. రోడ్డు మెలికలలో జ్యోతులు దాగుడుమూత లాడుతున్నాయి. అయిదే నిమిషాలు గడిచాయి చీకట్లో చిన్నగా వెలుగు చేసుకుని, దారి వెతుక్కుంటూ వస్తూన్న చిన్నకారు విశాల చుట్టూవున్న పరిస్థితి గమనించి కాబోలు దప్పున ఆగింది. ఆమె వుద్దేశంకూడా అదే. లైట్లు ఆరాయి.

మరుక్షణంలో తలుపు తీసుకుని, టార్చిలైటు వెలుగు రోడ్డుమీద ప్రసరింపజేస్తూ ఓ వ్యక్తి, విశాల దగ్గరకు నడిచివొచ్చాడు.

"ఏం జరిగిందండీ?" యింగ్లీషులో, నమ్రతగా ప్రశ్న వొచ్చింది.

వెంటనే విశాల జవాబు చెప్పింది.

ఆ వ్యక్తి సానుభూతి చూపించి "ఎంతదూరం పోవాలి?" అని మళ్ళీ అడిగాడు.

జవాబు చెప్పింది విశాల.

"మేమూ ఆ ఊరే. మీ పేరు ఏమిటి?"

జవాబు చెప్పింది.

చీకటిలో కనిపించకపోయినా ఆ వ్యక్తిలో కొద్దిగా సంచలనం కలిగినట్లు లీలగా తట్టింది విశాలకు. ఈ విషయంలో ఆమె ఏదీ నిర్ధారణ చేసుకోకముందే ఆ వ్యక్తి "మాలతీ" అని పిల్చాడు.

లేడీడాక్టర్ నివ్వెరపాటు గ్రహించకుండా అతను దబ్బున తన కారుదగ్గరకుపోయి మళ్ళీ "మాలతీ" అని మృదువుగా పిలిచాడు.

"ఏమిటి?" అని లోపలనుండి ఓ హీనస్వరం వినవచ్చి, యించుమించు అదే క్షణంలో లోపలి లైటూ వెలిగింది. సుమారంలో నిల్చున్న విశాల వెనుక సీటులో కూర్చునివున్న ఓ స్త్రీ తాలూకు పాలిపోయివున్న సుందరవదనాన్ని అస్పష్టంగా చూడగలిగింది.

"ఎవరొచ్చారో చూడు" ఆ పురుషుడి కంఠ ధ్వని ఉత్సాహంగా వినవచ్చింది.

"ఎవరు?"

"నువ్వే గుర్తుపట్టు... డాక్టర్! ఓసారి యిటు వస్తారా?"

ఆమె మెల్లగా కారుదగ్గరకు నడిచివచ్చి, లోపలవున్న స్త్రీకేసి దీర్ఘంగా చూసింది. లోపలి ఆమె అలాగే చూసింది.

మొదట సందేహం, పిదప ఆశ్చర్యం, తరువాత సంతోషం యివన్నీ యించుమించు ఒకేసారి ఆయిద్దరి స్త్రీల ముఖాకృతులలోనూ ప్రతిఫలించి "నువ్వా" అని యిద్దర్నీ మళ్ళీ ఒకేసారి రమారమి పలకరింప జేశాయి.

"మాలతీ" అంది విశాల గాద్గదికంగా. ఆమెకు ఎందుకో యిప్పుడే దుఃఖంలాగా వచ్చింది. ఆ స్థితి లోనే కన్నీళ్లు కారితే వాటినే ఆనందభాష్పా లంటారు.

"ఎన్నాళ్లకి కలుసుకున్నాం విశాలా. లోపలకు రా"—ఆమె మాటలు పూర్తికాకముందే పెద్ద దగ్గు తెర వచ్చింది. దవ్వాన వెనకవున్న బాలీసుకు ఆనుకుని, తల వంచుకుని, ప్రేగులు తెగిపోయేటట్టు దగ్గుతూ, అవస్థ పడసాగింది. విశాల ఆలస్యం చేయకుండా అటువైపు తిరిగివెళ్లి, తలుపు తీసుకుని లోపలకువెళ్లి మాలతి భుజా లను గట్టిగా పట్టుకుంది.

"మాలతీ. అయ్యో ఏమిటిది?"

మాలతి స్నేహితురాలివైపు జాలిగా, దీనంగా చూసింది. అతి ప్రయత్నంమీద జవాబు ఏదో చెప్ప బోయేటంతలో మళ్ళీ దగ్గుతెర వచ్చి, మనిషి వేళ్లాడి పోయింది.

అయిదునిమిషాలు బాధగా, వ్యథగా నిశ్శబ్దంగా గడిచాయి.

మాలతి బాగా తేరుకున్న తర్వాత హీనస్వరంతో అంది—"అంతే అది."

"అంటే?"

నవ్వటానికి ప్రయత్నించి విఫలురాలై ఆమె "నాకు టి. బి."

విశాల ఒక్కసారిగా విద్యుద్ఘాతం తగిలి నట్లుగా వొణికింది. "ఏమిటి? ఏమిటి?."

"ఏమీ లేదు. రెండేళ్ల క్రితం దాపురించింది నాకు. అప్పటినుంచీ యింతే."

"ట్రీట్ మెంట్ తీసుకోలేదా?"

"వెయ్యవలసిన ప్రశ్న వేశావు? ఎందుకు తీసు కోలేదూ? రోజూ స్పెషలిస్టు మాఇంటికి వచ్చిపోతుం టాడుగా."

విశాల నిట్టూర్చి "ఎటువంటి పరిస్థితిలో నిన్ను చూశాను" అని ధోరణి మార్చటానికి ప్రయత్నిస్తూ "అయితే ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది? దాగుడు మూత లాడదామనుకుంటున్నావా? కనిపించావు కాదేం?" అని గబగబ అడిగింది.

మాలతి యీ ప్రశ్నలకు జవాబు చెప్పబోయే టంతలో బయటనే తచ్చాడుతున్న మాలతి భర్త మరీ దగ్గరకు వచ్చి "యిక్కడేనా ఏమిటి కబుర్లు? ఈ చీకట్లో ఏమిటి? డాక్టర్ గారు మనతోనే కారులో వస్తారు." అన్నాడు.

"కాదు. నాకోసం అక్కడ టాక్సీ వుందికదా" అని విశాల నవ్వాన అంది.

"అది యింకో గంటకు గాని బాగుపడితే నయమే. డ్రైవర్ తోనే చెప్పేసి వస్తాను" అని అతను రెండు నిమిషాల్లో ఆ పని ముగించుకువచ్చి ముందు తలుపు తెరిచి స్టీరింగు ముందు కూర్చున్నాడు. ఇందులో మొహమాట పడాల్సింది ఏమీ లేదని గ్రహించి విశాల మౌనంగా కూర్చుంది. కారు కదలింది.

"ఇప్పుడు చెప్పు" అంది విశాల రెండు నిమి షాలు గడిచాక.

"ఏముంది? వారికి యిక్కడికి ట్రాన్స్ఫర్ అయి వారం రోజులయింది"

"అయితే నేను యిక్కడే వుంటున్నానని తెలిసి ఎందుకు వచ్చి కనిపించలేదు? పోనీ ముందుగా ఎందుకు ఉత్తరం రాయలేదు."

మాలతి వెంటనే క్షీణ స్వరంతో "ఏం చెప్పనూ. నా ఊహలు మరో విధంగా వున్నాయి. హఠాత్తుగా వచ్చి ఆశ్చర్యంలో ముంచి లేద్దామను కున్నాను" అంది.

"ఆశ్చర్యం సరే. దుఃఖంలో ముంచావు" అను కుంది విశాల లోలోపల.

ఇంతలో ఆమె దృష్టి సీరియస్ గా డ్రైవ్ చేసుకు పోతూన్న మాలతి భర్తపై బడింది. ఆమె పెళ్ళికి తను వెళ్లలేదు. అతని పేరు ముకుందరావు అన్నట్లుగా గుర్తు. గజిటెడ్ ఆఫీసరని మాలతి ఉత్తరాలే చెప్పాయి. ఆమెలో హఠాత్తుగా ఓ ప్రశ్న ఉదయించింది. దానికి జవాబు సులభమే. ఆ సులభమైన జవాబు ఆమెకు తోచేటంతలో మాలతి నాలిక కొరుక్కొని అంది. "సారీ—మీ యిద్దరకూ పరిచయం చేయనేలేదు."

పరిచయం ముగించాక ముకుందరావు అన్నాడు: "మీతో నాకు ముఖ పరిచయం యిదే ప్రథమం అయినా, మీ గురించి ఎంతో స్నేహితుడైనవాడు కూడా తెలుసుకోనట్లుగా, మీరు నాకు తెలిసేటట్లు మా మాలతి చేసింది. ఘన కార్యం కదూ. అందుకనే మీ పేరు మీ నోటినుంచి రాగానే ఎవరో గ్రహించి వేశాను."

ఇదే, యిందాక విశాలకు తోచబోయిన సులభమైన జవాబు. ఆమె యిప్పుడు చిన్నగా నవ్వి, ఊరుకుంది.

తర్వాత స్నేహితురాళ్లిద్దరూ లోకాభిరామాయణంలో పడ్డారు. మధ్య మధ్య ముకుందరావుకూడా వీళ్ళ సంభాషణలో జోక్యం కలిగించుకున్నాడు. ఈ యిద్దరి స్నేహితురాళ్లమధ్య వున్న స్నేహం కొంచెం విచిత్రమయింది. అయిదేళ్లు ఒకర్నొకరు చూసుకోకుండా గడిపారు. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా యిన్నాళ్లు యెక్కువగా జరగలేదు. కాలేజి రోజులలో ఆప్త మిత్రురాలిగా పరిగణించిన వ్యక్తి వివాహానికే కారణాంతరాలవల్ల విశాల హాజరుకాలేదు. విశాల డాక్టర్ అయాక చూడటానికి అవతల వ్యక్తికీ పడలేదు. ఆమెకు భయంకరమైన ఓ వ్యాధి సంక్రమిస్తే ఈమెకు తెలియటం సంభవించలేదు. విచిత్రం కాదూ? ఐనా ఇద్దరిమధ్యా ఆప్యాయతకేం లోటు లేదు. అంతేకాదు, చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్నప్పుడు తాత్కాలికంగా జనించే సిగ్గు, మొహమాటం యివన్నీ లేవు వీళ్లమధ్య. విశాల స్నేహితురాలి ఆరోగ్యం గురించి వివరాలింకా అడుగుదామనుకుందిగాని అది సమయం కాదని ఊరుకుంది. మధ్య మధ్య రెండు మూడు సార్లు మాలతికి దగ్గుతెరలు వచ్చాయి. ఆ సమయంలో మాలతి కళ్లలో ఒకరకం బాధతో తిరిగిన కన్నీళ్లే, విశాలతరళనయనాల్లోనూ మరో రకం బాధతో తిరిగాయి.

చాలాసేపు గడిచాక, సిటీలో జనసంచారం బాగా సన్నగిల్లాక కారు పురవీధులలోకి ప్రవేశించింది. ఒకటి, రెండు మైళ్లు, పది పదిహేను మలుపులు తిరిగింది. ఓ పెద్దమేడ గేటుముందు కారు చిన్నగా ఆగాక "యిదే మా యిల్లు" అంది మాలతి. విశాల తల ఊపి, లేచి స్నేహితురాలు కారునుంచి దిగటంలో సాయపడింది.

"లోపలకు రా" అంది ఆమె ఆయాసపడుతూ.

"ఇప్పుడు కాదు. ఇప్పటికే చాలా రాత్రయింది. ఇంకో రెండు మూడు రోజుల్లో వీలు చూసుకుని వస్తాను" అంది విశాల.

"తప్పకుండా రావాలిసుమా." అని భర్త వంక తిరిగి "కారులో ఆమెను యింటివరకు దిగబెడ్తారు గదా" అంది.

విశాల యింకా కంగారు పడుతూండగానే ముకుందరావు "రాండి" అని ఆహ్వానించాడు. మనసులో చాలా నొచ్చుకుంటూ స్నేహితురాలి దగ్గర సెలవు తీసుకుని కారులో ఎక్కి కూర్చుంది. తర్వాత యిద్దరూ ఎక్కువగా మాట్లాడుకోలేదు. విశాల తన యింటివద్ద దిగిపోతూంటే, అతను "ఒకసారి వీలు చూసుకుని తప్పకరండి. మాలతి కేమీ తోచదు" అన్నాడు. ఆమె తల ఊపి, థ్యాంక్సు చెప్పి లోపల కొచ్చేసింది.

* * *

మొదట ఆమె రెండు మూడు రోజుల్లోనే స్నేహితురాలింటికి వెడదామనుకుంది గాని, డిస్పెన్సరీలో వర్క్ ఎక్కువగా వుండటం వల్లా, బంధువుల ఇంటికని వెళ్లిన తల్లి ఇద్దరు ముగ్గురు బంధువులని కూడా వెంటబెట్టుకుని బెంగుళూరునుంచి వచ్చేయటంవల్ల తీరిక లేక వెళ్ళలేకపోయింది. ఆ ప్రయాణం ఆదివారం దాకా వాయిదా వేసుకుంది. చివరకు ఆదివారం వచ్చింది. మధ్యాహ్నంనుంచీ అంతా సెలవే కావటం వల్ల ఆమె వొంటిగంటకు బయల్దేరింది.

"కుక్కలున్నాయి జాగ్రత్త" అన్న బోర్డు ఆమె చూసుకోలేదు. తొందరలో రెండడుగులు గేటు దాటి ముందుకు వేసేసరికి గొలుసు కట్టివున్న దెయ్యపు కుక్క గయ్యమని ముందుకు ఉరకబోయింది. విశాల చచ్చే భయంతో కళ్ళప్పజెప్పి చూస్తూ నిలబడి

పోయింది. లేడీ డాక్టర్ గారిని యిప్పుడో పెద్ద సమస్య ఎదుర్కోబోతోంది. కాని ఆమె అదృష్టం బావుంది; ప్రక్క గదిలోంచి సవ్వడి విని లేచివచ్చిన ప్యూన్ ఆమెను రక్షించాడు.

పక్కని గదుముతూ, వినయంగా ఆమెవైపు చూస్తూ "లోపలకు వెళ్ళండమ్మా" అన్నాడు.

విశాల వాడివంక కృతజ్ఞతతో చూసి, మరి రెండు మూడు అడుగులు వేయకముందే నీరసించిన మాలతి సుందరవదనారవిందం పైనున్న కిటికీనుంచి తొంగిచూసింది.

"విశాలా" అని పిలిచింది ఆమె చేయిఊపుతూ.

విశాల పైకి చూసి జాలిగా నవ్వి "వస్తున్నా" అంది. ప్యూన్ మెట్లవైపు దారి చూపాడు. ఆమె గబగబ మెట్లు ఎక్కి పైకి వెళ్ళిపోయి, స్నేహితురాలితో ముందుగా అన్న మాట యిది: "హడిలి చచ్చాననుకో"

మాలతి గోడకుఆనుకుని నిల్చుంది. ఆ క్షణంలో ఆమె పాలిపోయిన పెదవులమీద చిగురించిన చిరునవ్వ ఆ ముఖానికి ఎటువంటి వన్నె చిన్నెలూ తెచ్చి పెట్టలేదు సరికదా, వెలాతెలా పోయినట్లుంది.

"మా యింటికి వచ్చిన ప్రతివారిపనీ యిలాగే అవుతుంది. "వద్దండీ" అన్నాను. విన్నారు కాదు.

తర్వాత యిద్దరూపోయి కుర్చీలలో కూర్చున్నారు. "రెండు మూడు రోజుల్లో రావటం అంటే యిదేనా ఏమిటి?" అని మాలతి ప్రశ్నించింది.

"ఏం చేయను? నీకూ నాకున్నంత పనివుంటే తెలుస్తుంది."

మాలతి స్నేహితురాలి వదనంలోకి ఒకసారి చూసి, తిరువాత తలవంచుకుని అంది "ఉన్నపనే నేను చేసుకోలేనుకదా."

ఉత్తరక్షణంలో ఆమె కనుకొనల్లో నీళ్లు తిరిగాయి. చిన్నగా అవి తర్వాత చిక్కిపోయిన చెక్కిళ్ళమీదుగా కంఠసీమపైకి ప్రవహించాయి.

"మాలతీ" అంది విశాల. "ఛా—ఏమిటిది?"

"ఏం చెప్పను విశాలా! నావంక చూడటానికి నీ కిప్పుడు భయం వేయటంలేదూ? నన్ను తాకేందుకు కూడా నీవు జంకటల్లేదూ? బహుశా యీ అనుభూతులు నీ కంతగా వుండకపోవచ్చు. డాక్టరివిగా నువ్వు. మావారికీ లేవనుకుంటా. ఆయన భర్త కాబట్టి భరిస్తున్నారు. మరి...మరి...." ఆమె కంఠం వొణికింది. ఎంతో నీరసంగా వొణికింది. "సహృదయంతో నన్నెవరు ప్రేమిస్తారు విశాలా? ఒకప్పుడు—నీకు తెలుసుగా. ఈ అందం ఎంతమందిని ఉన్మాదుల్ని చేసిందో! ఈ చేతులు చూడు ఎలా క్షీణించిపోయాయో. నా గొంతులో మాధుర్యమేనా నీకు వినిపించేది? ఇంకా కొంచెం గట్టిగా మాట్లాడితే అంతా రక్తం—రక్తం—రక్తమయం.

ఆమె రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుంది రక్తంతో కాదు; రక్తంలాంటి కన్నీళ్ళతో అవి త్వరలోనే తడిసిపోయాయి. విశాల ఉద్వేగాన్ని అణచుకుంటూ ఆమె చేతుల్ని, వదనమండలంనుండి బలవంతంగా విడదీసి, కంపితస్వరంతో అంది "మాలతీ. నీకు పిచ్చిగానీ ఎత్తలేదుగదా."

"ఆ అదృష్టం అందరికీ పడుతుందా విశాలా."

"చాల్లే. ఈ వేదాంతం ఎప్పటినుంచీ?"

"చెప్పలేను" అని ఆమె గంభీరంగా "యిదీ వేదాంతమంటావా డాక్టర్. నే నందులో ఓనమాలయినా నేర్చుకోలేదే. బహుశా ఒకటి నిజం కావచ్చు. కష్టాలు వచ్చినప్పుడు మానవుడి నోటినుంచి ప్రతిమాటా వేదాంతంగా యితరులకు ధ్వనించవచ్చు" అని నిట్టూర్చి "సంతోషంవస్తే మనిషి నవ్వుతాడు. కష్టంవస్తే నాలాగే ఏడుస్తాడు. మరి యీ దుఃఖసమయాల్లోనేనా వేదాంతం వచ్చేది? విశాలా, నేను చెప్పేది అర్థమయిందా? వేదాంతంలో కొంతస్వార్థం వుందన్నమాట. ఆ ప్రకారం ప్రతివారూ ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక క్షణంలో వేదాంతులు అవుతూనే వుంటారు. బలే. అయితే యీ సిద్ధాంతానికి ఏర్పడిన ఆప్రత్యేక విలువ ఏమయినట్టు."

"మాలతీ...మాలతీ...మాలతీ"

తల వంచుకుని, కొంచం ఆగి, మళ్ళీ తల పైకిఎత్తి గాద్గదికంగా అంది ఆమె.

"మాట్లాడనియ్యి విశాలా! మాట్లాడితే కొంచం ఆవేదన తగ్గవచ్చు"

విశాల స్వరం చిన్నదిచేసి అంది: "నీ కెలా ఊరట కలిగించాలో నాకు బోధపడటంలేదు. డాక్టర్లందరూ సాధారణంగా కృత్రిమంగా ఊరడించటానికే అలవాటుపడి వుంటారు. ఈ అలవాటు

బహుశా నీవు నాకు ప్రాణస్నేహితురాలివి అవటం చేత నేమో, నా చేత నోరు విప్పించటం లేదు."

తరచి యోజిస్తే యీ మాటలు అవతల వ్యక్తి హృదయానికి ఎంత గాఢంగా నాటుకుంటాయో విశాల ఆలోచించ లేదు. కాని అవతలి వ్యక్తి అంత తరచి యోజించక పోవటంవల్ల అక్కడ సన్నివేశం, మరింత చెడి రసాభాస కాకుండా కాపాడబడింది.

తరువాత మళ్లీమాలతి అంది "అక్కడవుండగా రెండేళ్లు యీ మాయదారి జబ్బుకోసం వేలకు వేల రూపాయలు తగలబోశాం. మెడిసిన్స్ తీసుకుని తీసుకుని ప్రాణం విసిగిపోయింది. ఈ ఊళ్లో మాకు తగ్గ స్పెషలిస్ట్ ఎవరూ దొరక లేదు." అని కొంచెం ఆగి "బహుశా యింకా కొన్నాళ్ళలో మదనపల్లి శానిటోరియమ్‌లో జాయిన్ అవుతాను. వారు అందు కోసం ప్రయత్నిస్తున్నారు."

విశాలకు మనసంతా చాలా కలతగా వుంది. ఇవాళ యింత విపరీత పరిస్థితుల్లోకి యీడ్చుకు పోబడ తానని ఆమె ముందుగా కొంచమైనా ఊహించ లేక పోయింది.

ఎవరూ మాట్లాడకుండా నిమిషాలు కొన్ని చికాకుగా మౌనంగా గడిచాయి.

మాలతి హఠాత్తుగా స్నేహితురాలి ముఖంలోకి సూటిగా చూస్తూ "డాక్టరివి కదా నువ్వు. నన్ను పరీక్షచేసి నేనింకా ఎన్నాళ్లు బ్రతుకుతానో చెప్పు" అంది.

విశాల ఒక్కసారిగా చలించింది. చప్పున ఆమె ముఖం నీలమేఘాచ్ఛాదితమైన ఆకాశంలా, వివిధ వర్ణ కిర్మీరితం అయింది. చాలా సేపటికి తెప్పరిల్లి అంది" నేనా సబ్జెక్టును స్పెషలైజ్ చేయలేదు. అయినా అవేం ప్రశ్నలు? నీ మొహం"

"నా కెందుకో అటువంటి ప్రశ్నలే వేయబుద్ధి వేస్తోంటూంది విశాలా"

ఇహ లాభంలేదని విశాల గ్రహించి టాపిక్ మారుద్దామని "ఆదివారం కదా. మీ వారు కనిపించ లేదేం?" అని ప్రశ్నించింది.

"లేరు. క్యాంప్ వెళ్ళారు?

"అయితే యింట్లో ఎవరెవరు వున్నట్లు?"

"నేనూ, పనివాళ్లూ అంతే. మా కెవరూ పెద్ద దిక్కు లేరుకదా"

ఎక్కువసేపు కూర్చోవటంవల్ల విశాలకు విసుగు పుట్టి, లేచి కిటికీ దగ్గరకు పోయి నిల్చుని క్రిందకు చూసింది ఇందాక మాలతి యీ కిటికీలోంచే తనను పిలిచింది. క్రింద పనివాడు కుక్కతో ఆటలాడుతున్నాడు. అది మచ్చిక అయిన జంతువే అయినా జాతి పౌరుషం నిలుపుకు నేందుకు కాబోలు అప్పుడప్పుడు మారాము చేస్తోంది. కరుస్తోంది కూడా. పెద్ద ఉత్సాహమేమీ లేకపోయినా ఆమె యీ దృశ్యాన్ని పరికిస్తోంది. ఒక నిమిషమైనా పూర్తిగా గడవలేదు. ఇంతలో పెద్ద పెట్టున వెనుక దగ్గు వినిపించింది. ఆమె ఆదుర్దాతో చప్పున వెనుదిరిగింది. రోగి చాలా సేపు దగ్గి దగ్గి అలిసిపోయి, రొజుకుంటూ, శక్తినంతా కూడ తీసుకుని లేచి ప్రక్కనే మెత్తని పరుపు వేసి వున్న మంచం మీద కూలబడి, తరువాత వాలిపోయి, తన వంక విచారంగా చూస్తోన్న విశాల నేత్రద్వయంలోకి దీనంగా చూసింది. తెల్లబోయి చూస్తున్న విశాలకు యీ చూపులు భరించటం కష్టం కాగా, చూపులు మరల్చుకుంది. ఎంత సేపు దుఃఖం భరించటం? చివరకు సాధ్యం కాలేదు ఏనాడూ చేయని పని ఒకటి యీనాడు చేసింది. పమిట చెంగు కన్నీళ్లతో తడిసింది.

"విశాలా! ఇలారా. నా దగ్గర కూర్చో"

నడిచి వెళ్ళి కూర్చుంది.

"నీ కళ్ళు అలా ఎర్రగా వున్నాయేం?"

"అంతే అవి. అప్పుడప్పుడూ అలా ఎర్రబారుతుంటాయి."

"మా వారికీ అంతే. అప్పుడప్పుడూ యీ అరుణ వర్ణం వారి నేత్రాల నావరిస్తుంది"

విశాల జవాబు చెప్ప లేదు.

"చెంపమీద గట్టిగా కొడితే ఆ ప్రదేశమంతా ఇలాగే ఎరుపు రంగు దాలుస్తుంది కదూ"

విశాల ప్రశ్నార్థంగా చూసింది.

"అలాగే హృదయం మీద ఎవరైనా కొడితే కళ్ళలో యీ రంగు ప్రతిఫలిస్తుందని నాకప్పుడప్పుడూ అనిపిస్తుంది విశాలా?"

ఈమె దీనికి ఏమని జవాబు చెబుతుంది? తల మాత్రం వంచుకుంది. బహుశా ఆ సమయంలో చేయ వలసిన సరియైన పని అదే.

మళ్ళీ కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"వారు నన్ను చాలా ప్రేమిస్తున్నారు విశాలా."

మాలతి ఆకస్మికంగా అంది. విశాల తల ఆడించి ఊరుకుంది.

"నాకు ఒకటే దిగులు. వారి ప్రేమను, నేనుతిరిగి యివ్వలేక పోతున్నానే అని. ఈ రోగిష్టిదాన్ని చూసి ఆయన ఏనాడూ విసుక్కోసులేదు. నా ఏమాటనూ త్రృణీక రించలేదు. ఆయనకు నేను చాలా ఋణపడివున్నాను. ఆ ఋణాన్ని తీర్చుకోలేకుండా వెళ్ళిపోతానేమోనని ...ఏదైనా క్యాంప్ వెళ్లాల్సివస్తే వారి మనసెంత కొట్టుకుపోతుం దనుకున్నావ్?"

మళ్ళీ నిశ్శబ్దం; చాలా సెకన్లు.

"అదే నా బాధ. అర్థమైందా?"

విశాల మాట్లాడలేదు. తల ఊపలేదు. స్తబ్ధుగా చూస్తూ ఊరుకుంది.

ఆమె అక్కడ మరిరెండు మూడుగంటలు గడిపింది. అవీ అంతే చాలా నిస్సారంగా గడిచాయి. ఆమె యీ స్నేహితురాలి దగ్గరకు సరదాగా, ఖులాసాగా గడుపుదామని ఆశపడి రాలేదుగాని, అనుకోకుండా దుఃఖం మరింత అధిగమించింది. మూడింటికి వంటమనిషి కాఫీ తెచ్చియిచ్చింది. మాలతి పాలు త్రాగింది. తర్వాత విశాల లేచి వస్తానంది. మాలతి ప్రతి రెండుమూడు రోజులకూ ఓసారి కలుసుకుంటానని మిత్రురాలు మాట యిచ్చాకనే ఆమెను వదిలి పెట్టింది. మధ్యాహ్నం నాలుగుగంటలకు విశాల దిగులుగా బరువుగా యింటికి చేరింది.

* * *

ఆమె అన్నమాట నిలబెట్టుకుంటూనే వుంది. సాధారణంగా వీలుదొరికినప్పుడల్లా మాలతి యింటికి వెళ్లి వస్తూనే వుంది. తన జబ్బునుగురించి మాలతిఅంటున్న మాటలలోని నిజం డాక్టరైన విశాలకి తెలుసు. ఆ వ్యాధి చాలా తీవ్రంగా ఆవ్యక్తిలో ముదిరిపోయిందనీ ఆమెకు తెలుసు. కాని యీ స్థితిలో ఆమె చేయగలిగింది ఏమీ లేదు. చప్పున శానిటోరియమ్‌లో చేరిపొమ్మని సలహాలు ఇచ్చింది. చివ్వరికి అదీ కార్యరూపం దాల్చింది. ఓ నెలరోజులలోనే ముకుందరావు అంతా ఖాయం చేశాడు.

ఆ రాత్రికి మాలతి బయలుదేరి వెడుతుందనగా విశాల చూసివద్దామని బయల్దేరింది. ఆమె వెళ్లేసరికి మాలతి వొంటరిగా కనబడింది. ముకుందరావు యింట్లో లేడు.

ఇద్దరూ ఆసీనులయ్యాక "అయితే వెళ్లిపోతున్నావన్న మాట" అంది.

"అవును. వెళ్లిపోతున్నాను."

విశాల చప్పున నాలుక కొరుక్కుంది. ప్రతి మాటకూ యిలా పెడర్థం తీస్తే తనుమాత్రం ఏం చేస్తుంది?

"అలా గనకు మాలతీ. ఇంకో ఆరునెలల్లో నువ్వు ఎలా తయారౌతావో చూడు. అద్దంలో చూసుకుంటే నిన్ను నువ్వే గుర్తుపట్టలేవు తెలుసా?"

"ఏ లోకంలో?" అని మాలతి పాడిగా నవ్వి "అవన్నీ గాలి మేడలు. రైట్ లంగ్ యిప్పటికే పూర్తిగా చెడింది. దాని బదులు స్పాంజ్ రిప్లేస్ చేస్తారుట"

ఒక క్షణంఆగి విశాల గట్టిగా నవ్వింది "అయితే ఏం? అలా వున్నవాళ్లు ఎంతమంది లేరు?"

కాని మాలతి యీ రోజు మరీ గంభీరంగా వుంది. కొంచం ఆగి "నిన్నో ప్రశ్న అడగనా?" అంది.

కొద్దిగా తెల్లబోయి విశాల "ఏమిటి?" అని ప్రశ్నించింది.

"జవాబు సూటిగా రావాలి."

"అలాగే"

"నువ్వింకా ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?"

విశాల ముఖం చప్పున నల్లబడింది. స్నేహితురాలి ముఖంలోకి ప్రశ్నార్థంగాచూసి ఊరుకుంది.

"చెప్పవూ?"

ఆమె జవాబుగా అస్పష్టంగా గొణిగింది. "కారణం లేకపోలేదు"

"అదే. చెప్పవూ?"

ఎంతో జాలిగావుంది యీ మాట; ఈ మాటే విశాల గుండెను చీల్చింది. తను యింకా పెళ్లి ఎందుకు

చేసుకోలేదు? పాతికేళ్ళ యీవయస్సు, యీ యౌవనం, యీ సౌందర్యం, యిదంతా... ఎందుకు? ఎందుకు? తను యింకా పెళ్ళెందుకు చేసుకోలేదు? ఈ విశాల జగత్తులో తనకు సమఉజ్జీ, ఎవరూ దొరకలేదా? కాదు. ఈ మాయదారి డాక్టరీ వృత్తిలో తను యీ సుఖాలన్నీ త్యజించిందా? వీటన్నిటినీ విస్మరించిందా? కాదు. కాదు. ఎందుకు తను యింకా పెళ్లిచేసుకోలేదు?

ఆమె చలించింది. దీని కంతటికీ కారణం ఒకటే.

చూస్తూండగానే ఆమె తరళనయనాలు అవిరళ బాష్ప జలపూరితాలయాయి.

ఈ వైఖరి చూసి మాలతి తృళ్లిపడింది. విహ్వల దృష్టితో ఆమె వంకచూస్తూ "విశాలా యిదేమిటి?" అని గొణిగింది.

ఒక క్షణం విశాల కనురెప్పలు, టపటప కొట్టుకున్నాయి. వెంటనే ఆమె తేరుకుని రుమాలుతో కళ్లు గబగబ తుడిచేసుకుంది. అంది:

"చెప్పలేను మాలతీ క్షమించు."

ఈ జవాబు తన మొదటి ప్రశ్నకో, రెండో ప్రశ్నకో ఆమెకు మొదట అర్థంకాలేదు. ఈ కన్నీళ్లు తనలాంటి ఆడదానివే. కొంచెం నిశితంగా ఆలోచించాక రెండు ప్రశ్నలకూ జవాబు అదేనని తెలుసుకుంది.

"నాతో చెప్పకూడదా ?"

"కూడదని కాదు. చెప్పలేను. అది నా అశక్తత"

"అయితే నిన్ను ఆ విషయం గురించి మరి ప్రశ్నించను. నా యింకో ప్రశ్నకు మాత్రం సమాధానం సూటిగా యివ్వాలి."

"ప్రయత్నిస్తాను".

"ఉహు. ఒప్పుకోను. నాకు చాలా ఖచ్చితమైన జవాబు అవసరం."

విశాల తల ఊపింది.

ఈ ప్రశ్న అడగబోయే లోపుగా మాలతి చాలా విచిత్రమైన అనుభూతి నొందింది. నెత్తురులేక పాలిపోయిన ఆమె ముఖం మరింత పాలిపోయింది. చిన్నబోయిందికూడా. తనలోని శక్తినంతా కూడదీసుకున్నట్లుగా, విశ్వప్రయత్నం చేసి పెదవులు కదిలించింది.

"అవసరంవస్తే యిహముందు పెళ్ళి చేసుకుంటావా ?"

"ఇప్పుడేం చెప్పగలనూ ?"

"అలా కాదు. కొంత శ్రమఅయినా సరే, ఆలోచించి చెప్పితీరాలి".

విశాల పెద్ద చిక్కులో ఇరుక్కుంది. ఏమిటీ ప్రశ్నలు? తన మనసు యిహ ముందు ఏవిధంగా వుంటుందో తనేం చెప్పగలదు? కాని చెప్పకుండా ఊరుకుంటే మాలతి ఊరుకునేటట్టులేదు. ఈ అవస్థ భరించలేక చివరకు ఆమె నోరు జారింది.

"ఆఁ చేసుకోవచ్చు".

ఈసారి మాలతి పరిస్థితి మరింత దిగజారింది. ఆమె ఫాలభాగం మీద స్వేద బిందువులు అలుముకున్నాయి. శరీరం కొద్దిగా కంపించటం ప్రారంభమైంది. పెదాలూ వొణుకుతున్నాయి.

"అయితే...అయితే...విశాలా! ఒక ప్రార్థన"

"ఏమిటి?"

"నీమీద ఎక్కువ చనువు తీసుకుంటూంటే క్షమించు. ఇది నా ప్రార్థన. నా కోరిక. నా కడసారి కోరిక."

వివర్ణమైన ఆమె వదనం. హఠాత్తుగా గంభీర రూపం దాల్చింది.

"నాగురించి నాకు తెలుసు. నేను యిహ ఎలాగూ జీవించను. కాని పోతూ పోతూ నేను ప్రేమించే, నన్నంత కంటే ప్రేమించే ఒక మహా పురుషుడికి అన్యాయం చేసి పోతున్నాను. ఇదే నా హృదయాన్ని కాల్చి వేస్తోంది. ఈ ఆవేదనను భరించలేను విశాలా కొంచమైనా భరించలేను. నేను పోయాక వారు ఏకాంతంగా యీ దుఃఖాన్నంతా భరిస్తూ ఎలా జీవించగలుగుతారు. వారి బాధల్ని పంచుకుని, వారికి మనశ్శాంతిని ప్రసాదించే హృదయం ఎక్కడ లభ్యమౌతుంది?"...కాని...యింత చొరవ తీసుకుంటున్నందుకు క్షమించు. అది నువ్వే...ఆ హృదయం నువ్వే విశాలా. నీ విశాల హృదయంలోనే వారికి చోటివ్వాలి"

భయంకరమైన యీ ఆవేశంలో కూడా ఆమె ఎదుటి వ్యక్తి ముఖం చూడటానికి భయపడింది. పాడు ముఖం అనుకుంటున్న తన వదనాకృతి ఎదుటి వ్యక్తికి

చూపించకుండా దాచేందుకు వేరే ప్రదేశం లేక, ఆ వ్యక్తి చేతుల్లో నే తల వాల్చి వలవలా ఏడ్చింది.

ఈ విపరీత పరిస్థితిలో ఏ స్త్రీ హృదయం, అందులో మరీ సన్నిహితురాలైన ఏ స్త్రీ హృదయం కరగదు.

మాలతి, విశాల హృదయంలో చోటు చేసుకుని, ఏడుస్తోంది.

ఈ కన్నీళ్ళని తుడిచేందుకు ఆమె చేతిలో వున్న రుమాల చాలదు; పమిటచెంగూ చాలదు. ఒకే ఒక వస్తువు. కాని అది తన స్వాధీనంలో లేదే.

"విశాలా. నాకోసం నువ్వీ త్యాగం చేయాలి."

త్యాగమా? ఇది త్యాగమా? విశాల మేను గగుర్పొడిచింది. చాలా సంవత్సరాలుగా తనలో దాగున్న ఓ వ్యక్తి, యీనాడు భూమి మీద జీవించి వుంటే, అప్పుడు యీ చర్యకు విపరీతార్థం తీసుకుంటే అది త్యాగంలాగా ధ్వనించవచ్చు. కాని ఆ వ్యక్తి యిప్పుడు లేడే. కాబట్టి ఆ రూపేణా యిది త్యాగమూ కాదు. తనను తాను త్యాగం చేసుకోవటమన్న మాటకి తన దృష్టిలో అర్థం లేదు.

సుఖాన్వేషణకు అది మారుపేరు. ఇందులో ఒకే ఒక అర్థం స్ఫురిస్తోంది. స్వర్గంలో వున్న ఆ వ్యక్తికి అపచారం చేయటం.

"విశాలా...వి...శా...అబ్బ"

దగ్గు...దగ్గు... దగ్గు...అంతులేని దగ్గు చాలా ఘోరమైన దృశ్యం. దగ్గు వెనుక నే రక్తం. రక్తం మరకలు విశాల చేతులుకూడా పంచుకున్నాయి. ఇహ యీ మనిషిలో కాఠిన్యానికి తావులేదు. సానుభూతికి లోటులేదు. అలిసి, సొలిసి నేలమీద వాలిపోయి, కళ్లు మూసుకుని పడుకున్న మాలతి ముఖంలోకి ఆమె వంగింది. పేరు పెట్టి పిలిచింది.

ఈ పిలుపు క్రిందపడివున్న వ్యక్తియొక్క శ్రవణకుహరాన్ని తాకి విశీర్ణం చేసేటట్లుగా పని చేసి వుంటాయి. నెమ్మదిగా కళ్ళు విప్పింది. ఎంత ఆతృత ఆ వాడిపోయిన నయనాల్లో కూడా.

ఈసారి విశాల గొంతు వీణమీటినట్లు మోగింది. "సరే అలాగే".

మాలతి బలహీనంగా విశాలచేతిని పట్టుకుని, తన హృదయం మీదకు లాక్కుంది.

"వొట్టువెయ్యి"

విశాలవెను దీయలేదు. మాలతి చేతిలో చేయి వేసి ప్రమాణం చేసింది.

* * * *

చాలా నెలలు కాకపోయినా అయిదారు దొర్లాయి. ముకుందరావు భార్యను దింపి, అక్కడే పదిహేను రోజులుండి, తనకు అంతకంటే సెలవు లేక పోవటంవల్ల వచ్చేశాడు. ఒక ఆడపని మనిషి, పనివాడూ అక్కడే వున్నారు. విశాల, అతనివద్దకు పదిహేనురోజులకోసారి అయినాపోయి వస్తూండేది. మొదటి రోజుల్లో అతనితో మాట్లాడటానికి ఒక విధంగా సంకోచించినా, యిప్పుడా సిగ్గు, బిడియం లేవు. అయినా వీళ్ళయిద్దరిమధ్యా మాలతి సంభాషణ తప్ప మరొకటి దొర్లేది కాదు. అదయినా చాలా ముక్తసరిగా వుండేది. స్వభావసిద్ధంగా అతను మాటకారే అయినా యీ విచారంవల్ల చాలా ముభావంగా వుంటున్నాడని ఆమె గ్రహించింది. వీలయినప్పుడల్లా అతను మాలతి దగ్గరకుపోయి వస్తూండేవాడు. అటువంటి సమయాలలో మరీ దిగులుగా వుండేవాడు.

మాలతిదగ్గరనుంచి విశాలకు తరుచు ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. వాటిల్లో రానూరానూ నిరాశావాదం ఎక్కువై పోతూంటంటే ఆమె ఆశ్చర్యపడలేదు. మూడు నాలుగు నెలలవరకూ ప్రతి ఉత్తరంలోనూ విశాల తనకు చేసిన వాగ్దానం విషయం హెచ్చరింపబడుతూ వచ్చింది. ఈ విషయం ఒకసారి ఎంత లోతుగా వెళ్లిందంటే "వారికి యిదేమీ తెలీదు, నన్ను ఎంత గాఢంగా ప్రేమిస్తున్నారో తెలుసా? బహుశా నేను చచ్చిపోయాక మళ్లీ పెళ్లి చేసుకోనని భీష్మించుకు కూర్చుంటారు. అటువంటప్పుడు ఆ బాధ్యత నీదే. నాకు నువ్వుగాక యింకెవరున్నారు చెప్పు..."

ఈ ఉత్తరం చదివాక ఓవిధమైన అసహ్యం కూడా జనించింది విశాలకు. ఏమనుకుంటోంది తన గురించి మాలతి. తోటి ఆడదాన్ని యిదేనా అర్థం చేసుకునే విధానం! స్నేహానికి యిటువంటివా పరీక్షలు? అయినా ఆమె తనకోపాన్ని ప్రత్యుత్తరంలో ఏమాత్రమూ తెలియపర్చలేదు. ఈసారికూడా ఆ స్నేహితురాల్ని మన్నించింది.

కాని ఎందుకో తరువాత తరువాత మాలతి దగ్గర నుంచి వచ్చే ఉత్తరాలలో యీ అంశం మాయమైంది.

మొదట విశాలకు అర్థం కాలేదు. ఇదివరకటిలాగా వివరంగా కూడా మాలతి ఆ ఉత్తరాలు రాయలేకపోతుంది. తనమీద వుంచిన నమ్మకం ఆమె ఆత్మకు హామీగా నిలిచి వుండవచ్చు. అదే నమ్మింది విశాల.

రాను రాను మాలతి దగ్గరనుంచి ఉత్తరాలు రావటం తక్కువై పోతోందికూడా.

ఒకసారి మరీ పది హేనురోజులు జాడా, కబురూ ఏమీ తెలియలేదు. ఆఖరికి ఓ రోజు యిహ ఉండబట్టలేక ముకుందరావు దగ్గరకు పోదామని బయల్దేరబోతూండగా అతని నౌకరే ఒకచీటీ తెచ్చియిచ్చాడు. "మాలతికి చాలా ఎక్కువగా వుందిట. నేనక్కడికి వెడుతున్నాను."

విశాల చప్పున కుర్చీలో కూలబడి బరువుగా నిట్టూర్చింది. త్వరత్వరగా ఆమె కనుకొనలనుండి నీళ్లు స్రవించాయి. "అంతే. ఇంకొన్నాళ్లలో ఆ వార్తా చేరుతుంది."

ఏ వార్త! ఏ వార్త? అయ్యో! ఎటువంటి దుర్వార్త!

బహుశా; బహుశా కాదు నిజంగానే యిది తన జీవితంలో తనలో సంచలనం రేపే రెండో చావు అవుతుంది.

హఠాత్తుగా ఆమె ఉలుక్కపడింది. ఎంత కఠినాత్మురాలు తాను? జీవించివున్న ఒక వ్యక్తి మరణాన్ని గురించి ముందుగా ఊహిస్తోంది.

కాని, తప్పదు. తప్పదు. మనసుని అరికట్టే శక్తి తనకు లేదు.

ఆ మొదటిచావు! అది ఎంతటి భయంకరమైంది. తను జీవితాన్ని గురించి నిర్మించుకున్న ఆశలు, ఊహలు అవన్నీ తనతో తీసుకుపోయింది. తనని యించుమించు జీవచ్ఛవాన్ని చేసింది.

ఇంతకాలం యీ దుఃఖాన్నంతా ఎలా భరించింది? చూపరులకు మామూలు మనిషిలా ఎలా కనిపించ గలిగింది? స్నేహితులతో, బంధువులతో సరదాగా, కులాసాగా కాలం ఎలా గడుపుతోంది?

ప్రయత్నం. ప్రయత్నం. ఆ ప్రయత్నమే తనని యింతవరకూ నలుగురితో కలిసిమెలిసి వుండేటట్లు చేస్తోంది. అది పోయేటందుకే ఆదివారాలు ఆనందంగా గడపాలని తాపత్రియ పడటం.

కాని...కాని...తనకు కఠినంగా ఆలోచించక తప్పటల్లేదు. రాబోతూన్న మాలతిచావు తనను మళ్ళీ ఏదో పరిస్థితుల్లోకి తీసుకు వెడుతోంది. మొదటిచావు తనను ప్రేమనుంచి దూరంచేసింది. ఈ రెండవది ప్రేమని నేర్పుతుందట. తను ప్రేమించాలట.

అంత దుఃఖంలోనూ ఆమె పెదవులు చిన్నగా హసించాయి. ఇది సాధ్యమా? అయితే తనలో స్వార్థం ఓపాలు ఎక్కువవుతుందన్నమాట. దీన్నే మాలతి త్యాగం అనవచ్చు.

ఏది త్యాగం? ఏది స్వార్థం? దానికీ దీనికీ ఎంత తేడా? మాలతికోసం అతన్ని పెళ్ళిచేసుకోవటం మాలతి దృష్టిలో త్యాగం అంతవరకూ తనూ ఒప్పుకోవచ్చు కాని...కాని అతన్ని ప్రేమించడం. అది త్యాగం కాదు. ఏమాత్రమూ కాదు. అంతేకాదు స్వర్గంలోవున్న మరో వ్యక్తికి ద్రోహంకూడా.

"నిన్ను తప్ప ఎవర్నీ ప్రేమించలేను విజయ్"

ఈ మాటలు తను నోటితో పలికిందా? కాదు. ఎక్కడో ఓచోట శాశ్వతంగా వుండేటట్లు లిఖించింది. ఎంత మనస్ఫూర్తిగా, వేదనగా రాసింది! ఇప్పటికీ ఆ లేఖ ఎక్కడో ఓచోట భద్రంగా వుండే వుంటుంది. అతను తన ప్రాణంకన్నా మిన్నగా దానిని దాచుకుని వుంటాడు.

"నేనూ అంతే విశాలా"

తన దగ్గర యీ మాటలు ఇప్పటికీ సురక్షితంగా వున్నాయి. మనసు బావుండనప్పుడల్లా వాటిని చదువుకుంటూనే వుంది. అతను అదృష్టవంతుడు. బ్రతికివుంటే తన మాటల్ని నిలుపుకునేవాడు. జీవించలేదు కాబట్టి ఆ బాధ్యత అతనిపై లేదు. మొదటిది జరిగివుంటే తనూ నిలుపుకునేది. ఇప్పుడూ చాలా కాలం వరకూ సఫలీకృతురాలౌతూ వచ్చింది. కాని మాలతికి సంభవించబోయే విపత్తు తన మాటల విలువను నశింప జేసేటట్లు చేస్తోంది. ఒక వాగ్దానం వచ్చి మరో వాగ్దానాన్ని ఎగరగొట్టింది. తను మాలతి భర్తను వివాహమాడకా తప్పదు. అతన్ని ప్రేమించకా తప్పదు.

ప్రేమ...ప్రేమ...ప్రేమ ప్రేమించాలి కాబట్టి ప్రేమించాలి.

తనకు యీ అవస్థనుంచి విముక్తి వుండదు. దానికి ఒక పేదారి. మాలతి బ్రతకాలి. విశాల నిట్టూర్చింది. కాని ఆమె బ్రతకదు.

అలా ఏకాంతం అనుభవిస్తే యింకా ఎంతసేపు ఆలోచనలు సాగిపోయేవో! కాని ఆమె తల్లి వచ్చి వాటికి బ్రేకు వేసింది. లోపలకు వెళ్ళిపోయింది.

*　　　*　　　*

మరో కొన్నిరోజులు బరువుగా నడిచాయి. ఆమెకు మనసు మరీ పాడయింది. డిస్పెన్సరీలో సరిగా పని చేయలేకపోతోంది. కాని తప్పని సరి. చాలా మందికి తనమీద గురివుంది. చాలామందికి తను మాతృత్వాలు ప్రసాదించాలి. అది తన విధ్యుక్త ధర్మం.

చివరకు ఒకరోజు హఠాత్తుగా ముఖం తెలిసిన ప్యూన్ ఒకడు వచ్చి, చీటీ అందిచ్చాడు. అది ముకుందరావు దస్తూరీ.

"మాలతి పోయింది"

వెంటనే దిమ్మెరపోయినా, మరుక్షణంలో తట్టుకుని వాడిని అడిగింది. "ఆయన ఎప్పుడు వచ్చారు?"

"రాత్రి వచ్చారమ్మగారూ!"

బరువు గుండె యింకా మొగ్గలేదు. దాని శక్తి యిదివరకే అయిపోయింది. ఇహముందు రాబోయే ఆలోచనలకు అర్థం వుండదు. మాట్లాడకుండా పోయి పడుకుంది. నిండా ముసుగు కప్పుకుంది. అయిదారు సార్లు తల్లి వచ్చి పిలిచినా లేవలేదు. మిడ్‌వైఫ్ అర్జంటుగా వచ్చి బ్రతిమిలాడినా కదల్లేదు. మెసల్లేదు. విధ్యుక్త ధర్మం అనుకుంటున్న గుణం ఆమెను యీసారి కదిలించలేకపోయింది. ఆ రోజు ఆమెను కదిలించ ప్రయత్నించిన వాళ్ళందరికీ నిరాశే మిగిలింది.

సాయంత్రానికి ఆమె ఉబ్బరించి పోయిన ముఖంతో ఒకసారి లేచి, అద్దంలో తన ప్రతిరూపం చూసుకుని, మళ్ళీపోయి పడుకుంది.

మరునాడు ఉదయం ఆమె లేచి స్నానం చేసింది. ముఖం యింకా కళావిహీనంగానే వుంది. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడలేదు. తరువాత టాక్సీలో ముకుందరావును చూడటానికి పోయింది.

నౌఖరు ఎదురుగావచ్చి "అయ్యగారు యింకా నిద్ర లేవలేదమ్మగారూ" అన్నాడు.

"లేపు. నేను వచ్చానని చెప్పు."

వాడు తెల్లబోయి, కొంచం సంకోచించి యిహ విధిలేక, లోపలకు వెళ్ళిపోయాడు. పావుగంటసేపు ఆమె అలాగే మౌనంగా కూర్చోవలసి వచ్చింది. తర్వాత ముకుందరావు లోపలనుంచి, చంటిపిల్లాడులా నడిచి వచ్చాడు. అతనికళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి. అవి పూర్తి నిరాశాజ్యోతులు. మాట్లాడకుండా ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

రెండు నిమిషాలు యిద్దరిలో ఎవరూ పెదవులు కదపలేదు.

చివరకు అతనే బలవంతంమీద అన్నాడు "మాలతి చచ్చిపోయి అయిదురోజు లయింది."

విశాల మాట్లాడేందుకు ప్రయత్నించటం లేదు. తలవంచుకు కూర్చుంది.

ఇద్దరిలోనూ ఎవరూ మాట్లాడేస్థితిలో లేరు. సంభాషణ జరగటం ఎలా? ఈలోగా నౌకరు కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. కొంతసేపటిదాకా కాఫీ తీసుకునేందుకు ఎవరూ ప్రయత్నించలేదు. అనాలనిపించికాదు గాని, అవసరం అనిపించి విశాల అనేసింది "కాఫీ తీసుకోండి. చల్లారిపోతుంది" తరువాత నాలిక కొరుక్కుంది. మాటలు ఆమెకే ఎలాగో ధ్వనించాయి.

ముకుందరావు ముఖం ఎత్తి, ఆమెవంక పొడిగా చూసి, కాఫీకప్పు చేతుల్లోకి తీసుకుని అన్నాడు, "మీరూ తీసుకోండి."

విశాల తీసుకుంది. కాఫీ త్రాగుతున్నారే కాని ఎవరికీ మాటలు రావు. ఏం చెయ్యటమో ఆమెకు పాలుపోవటం లేదు. తను ఏమి చెబుదామని యిక్కడికి వచ్చిందో గుర్తుకు రావటం లేదు.

"మిమ్మల్ని చాలా అడిగానని చెప్పమంది."

జవాబు యివ్వలేక పోయింది యీసారి కూడా ఆమె.

"మిమ్మల్ని క్షమించమని కోరుకుంటున్నానని చెప్పమంది?"

క్షమించ మందా? ఎందుకు? త్వర త్వరగా ఆమెకు మాలతికీ తనకూ ఆనాడు జరిగిన సంభాషణ అంతా జ్ఞప్తికివచ్చింది. ముకుందరావు వంక చూసింది. విరాగిలా, యోగిలా వున్నాడు. అతన్ని చూస్తే చెయ్యెత్తి నమస్కరించ బుద్ధి వేస్తోంది. "ఎంత పని చేశావు మాలతీ" అనుకుంది.

ఎంతసేపు యీ మౌనం! తనుయిక్కడికి ఏదృఢ నిశ్చయంతో వచ్చింది? మళ్ళీ అవన్నీ గుర్తుకు వస్తున్నాయి. రహస్యాన్ని మనసులో దాచి పెట్టుకునే శక్తి తనకు లేదు.

తనని మాలతి కోరిన సహాయం చేయవలసిన సమయం దగ్గరకు వచ్చింది. ఈతరుణంలో తప్ప అటువంటి వాక్యాలు పెదవులుదాటి బయటకు రావు. కనీసం పెదవులవరకైనా వచ్చే నమ్మకం లేదు. ఇదే మంచి అదను.

"మాలతి మీతో యింకేమైనా చెప్పిందా?"

"ఆఁ"

"ఏమిటి?" కుతూహలం ఆపుకోలేక పోతోంది. ఈ విషయం అతనికి కూడ తెలుసునా?

అతను ఒకసారి సూటిగా ఆమె ముఖంలోకి చూశాడు. ఏదో చెప్పబోయి, చేతకాక, తలవంచుకుని, ఏదోతోచి, మళ్ళీ తలఎత్తి యిలా పలికాడు:

"నా...నా... పెళ్లి విషయం"

విశాల ఊపిరి బిగపట్టింది. ఈ స్థితిలో అతని మొహం తాను ఎలా చూడగలుగులోంది?

"ఏ.. ఏ...మంది?"

ఉన్నట్లుండి అతను విషాదం గానవ్వాడు. నాతో అమె అయిదు సంవత్సరాలు గడిపింది. కాని నా గురించి కొంచమైనా అర్థం చేసుకోలేక పోయిందని మొన్న తెలిసింది"

ఏమిటి అతను అనేది? తన నిశ్చయం, త్యాగం, ఊహు స్వార్థంలో త్యాగం, ఊహు త్యాగంలో స్వార్థం—అవన్నీ.......

"ఆమె అంది కదా...మీరు...మీరు యింకెవర్నీ పెళ్లి చేసుకోకండి"

తృళ్ళి పడింది విశాల. ఏమిటి? మాలతి యిలా అందా?

అకస్మికంగా అతను ముఖం గంభీరంగా చేసి, కటువుగా నవ్వాడు. "ఎంత స్వార్థమో చూడండి. నేను యింకెవర్నీ పెళ్ళి చేసుకోకూడదుట. ఆమెని ఎంత ప్రేమించినా, ఆ స్వభావాన్ని నిందించకుండా ఉండలేను."

"విశాల యింకా, యింకా తెల్లబోతోంది. ఆమెలోని రక్తమంతా ఘనీభవించినట్లు అనుభూతి పొందుతోంది.

"ఆమె నన్ను ఎందుకు అరం చేసుకోలేదో నా కర్థం కావటం లేదు. అలా అని వొట్టు కూడా వేయించుకుంది."

అతని గొంతు అపస్వరాలు పలుకుతోంది.

"నా హృదయంలో ఆమెకు తప్ప యింకొకరికి చోటు లేదని ఆమెకు తెలియదు."

విశాల ముఖం క్షణంలో మ్లానమైంది. మాలతి! తను ఆమెను అర్థం చేసుకోవటంలో పొరబడిందా? లేక ఆమె తనను అర్థం చేసుకోవటంలో పొరబడిందా? మరి ఆనాడు ఆమె తనతో అన్న మాటలు? ఆ ప్రార్థన ఆ వాగ్దానం; ఇంతలో యీమె మనసు మారిపోయిందా? ఇంత స్వార్థమా? స్త్రీ స్త్రీ స్త్రీ ఆమెకు పూర్తిగా దుఃఖమే వస్తోంది. తనూ స్త్రీయే. తన ఆత్మను ఆమె సర్వ నాశనం చేసింకే. ఆ మాటలకు లోబడి తను స్వార్థానికి తలపడింది. త్యాగం చేయబోయింది. ఇష్టంకు లేని ఒక వ్యక్తికి ద్రోహం చేయ తలపెట్టింది. అన్నీ చేసింది. మనసు వున్న స్త్రీ చేయరాని పనులన్నీ చేసింది. ఏది స్వార్థం? ఏది త్యాగం? చివరకు యీ విచక్షణా జ్ఞానాన్ని కూడా విస్మరించింది. తనని మాలతి తనకు తెలియకుండానే అన్ని విధాలా సాధించింది. తన మనసు మీద స్వారీ చేసింది. చివరకు తనని ఎందుకూ పనికిరాని దానిగా చేసింది. తను దూరంగా తప్పుకుంది.

అధరాలు...ఆమె అధరాలు అదురుతున్నాయి. కన్నీళ్లు కారబోతున్నాయి.

కాని ఆ పరిస్థితి అంతటితోనే ఆగింది. హఠాత్తుగా ఆమె నేత్రాలు మెరిశాయి.

ఎందుకు యిందాకటినుంచి దుఃఖపడింది? ఏం జరిగిందసలు?

ఏమీ జరగలేదు. కొంచం మెలికలు. అంతే. క్రమక్రమంగా ఆమె వదన మండలాన్ని ఆవరించిన చీకటి ఛాయలు తొలగిపోయాయి. ఇప్పుడా వదనం తైలం లేని దీపంలా లేదు. లేచి, నిలబడి ముకుందరావు వంక చూసింది. అతను తల వంచుకు కూర్చున్నాడు. ఈ వ్యక్తితో కొన్ని నిమిషాలక్రితం ఏం మాట్లాడబోయిందతాను? సిగ్గుతో ఆమె సుందర వదనారవిందం సంధ్యారాగరాగ దీపితమైంది. కాని అది క్షణంసేపే. తరువాత ఏమీ శబ్దం చేయకుండా బయటకు నడిచి వచ్చేసింది.

బయట ఆమెకోసం యింకా టాక్సీ నిలబడే వుంది. విసురుగాపోయి కూలబడింది.

"థ్యాంక్యూ! థ్యాంక్యూ మాలతీ."